ఆమె యెవరు?

[కథానిక]

= శ్రీ ఆడుమిల్లి విశ్వనాథరావు =

౧

నేను అపుడు సుషుప్తావస్థలో ఉన్నానేమో! ఓవైపున యుద్ధాన్నిగురించిన మూడునాలుగురకాల గొంతుకలు ఆంగ్ల మిశ్రమయిన ఆంధ్రంతో వినిపిస్తున్నాయ్. వోమూలనించి చక్కటి కలకంఠవీణానాద సమానమైన కిన్నెరస్వరంతో బాటు వొత్తులు దృఢంగా ఉచ్చరిస్తున్న వోముసలిగొంతు సంభాషణ మధ్యమధ్య కట్ అయిపోతూ నాకర్ణముల లీలగా ప్రవేశిస్తూంది. వోహ ప్రక్కనించి 'కిస్మత్' ఫిల్ముగురించి యిరువురు మిత్రులు చేస్తున్న ప్రసంగం పరిమితితప్పి నిద్రస్తున్న - కాదు; కలతనిద్రలో ఉన్న నాచెవులకు నానాబీభత్సమూ కలిగిస్తోంది. దూరాన్న యింజను అరుస్తో పరిగెడుతోంది. ప్రక్కనున్న కిటికీలోంచి గాలి హోరున ధ్వనిస్తున్నట్టు తోస్తూంది.

కాళ్లపయిన ... నాకాళ్లపైనే... యేదో బరువైన పదార్థం ఆనగానే చప్పున కలత కునుకు ఎచటికోపోయింది. మెళుకువవచ్చింది. బరువెక్కిన కనురెప్పలు లేవటం లేదు. వాట్లనంత బలవంతంగా లేపేందుకు ప్రయత్నమూ చెయ్యలేదు. యేమీ అంటే బద్ధకం ఎక్కువగా ఉంది. నా కాళ్లమీంది బరువూ మళ్లా వో పదిపౌనులు పెరిగినట్టు తోచింది. పై బల్లమీంది నాబెడ్డింగుగాని జారి కాళ్లమీద పడుండవచ్చనుకున్నాను. కాని అది నిశ్చయింపదగ్గదిగా తోచలేదు. యీబరువుకి ప్రాణం వున్నట్టు తోస్తోంది. అంచాతనే ఇటూ అటూ కదుల్తోంది. ప్రాణంలేని పదార్థంలో చలనం ఉండదని నాకు గట్టినమ్మకం.

ఇహ తప్పనిసరిగా కళ్లు విప్పి ఇట్టే చూస్తినిగదా! నాకే సిగ్గేసింది. మరి ఆవిడకెంత సిగ్గులేకపొయ్యిందో, ఆమెగారే నా కాళ్లపయిన కూచున్నది. పోనీ, యే పల్లెటూరి ముసిలమ్మయినా అయితే చింతే లేదు. యేదోవిధంగా, యెక్కడా నించోటానికి కూడ చోటు దొరక్క, ఇంచుక విశ్రమించినదని ఊహించటాని కయినా వీలుండేది. కాని యీమె అలాటిది కాదు. ఇరవైయేండ్ల వయసు, పండు తమలపాకులాటి ఛాయగల తనువుశోభ, కెందామరలవలె నీలిఛాయల నీనే కళ్లల్లోని వాలకమూ, ఆధునిక పద్ధతులు స్ఫురించేట్టు ధరించిన ఆ పలాచటి వస్త్రాల్లోని తీరులూ ఇలాటి వన్నీ గమనించిన ఆమెను వృద్ధయని ఎట్లా అనుకోను? ఆమె అలా కూర్చున్నందుకు నేను ఇంతగా బాధపడిఉండేవాణ్ని కాదు. మీదుమిక్కిలి ఆనందించేవాణ్ని. కాని ఇక్కడ వచ్చిన గట్టి చిక్కు ఒహటే. పెట్లో ఇతర ప్రయాణీకులు

చాలామంది వున్నారు. వాళ్లంతా చాటుగా మాటుగా ఎదురుగా నవ్వరూ? అటువంటి తరుణి వచ్చి కాళ్లమీద కూచోటం ఎంత అదృష్టం, లక్షరూపాయ లిస్తేమాత్రం అంత మందిలో పబ్లీగ్గా కూచుంటుందా అని కొంత మంది వ్యక్తులు భావించరూ? యెవరు నవ్వినా, యెవ రెలా భావించినా, నాకు మాత్రం ఇది అవమానంగానే తోచింది. కారణం ఇది నలుగురూ ఉన్న రైలుపెట్టె కావటమే.

ఆమెప్రవర్తనకు నాకు ఎంతేనా వచ్చింది కోపం. నమిలిమింగేదా మన్నంత. నవ్వుతున్నట్టు తోస్తున్న ఆమొహంలో అందమూ, ప్రశాంతమూ చూస్తే మళ్లా అదంతా పోతోంది. యేది ఎలా ఉన్నా ఆమె అలా కూచోటంమాత్రం భరించలేను. భరించటానికి అవకాశాలూ లేవు. పుస్తెగట్టిన యిల్లాలుకూడ యింత స్వతంత్రాన్ని ఎన్నడూ తీసుకోలేదే, అల్లాంటప్పుడు కళ్ల పరిచయమయినా జీవితంలో లేని యీమె కెలా వచ్చిం దీధైర్యం? ఇప్పటికే ఇందుగురించి పెట్లో ఉన్న నలుగురిలోనూ ఎన్ని గుసగుసలు బయల్దేరినవో? ఎన్ని రాద్ధాంత సిద్ధాంతాలు జరుగుతున్నవో? ఎన్ని సమీక్షలు ప్రారంభమయినవో?

కళ్లు పూర్తిగా తెరవనూ తెరవకుండా, పూర్తిగామూయనూ మూయకుండా, ఆబరువును వోపికతో భరిస్తూ, ఆమె నెలా లెమ్మనేదా అని ఊహిస్తున్నాను.

"మీ ప్రవర్తన ఏమంత మర్యాదగా లేదు." అని అందామా అనుకున్నా. ఆ అనటం మనసులోనే గాని పైకి అనలేక పోయ్యాను. పెదిమలు లేవటం లేదు. ముద్దుగా ఆవిణ్ని లేపే ఉపాయం నాకు స్ఫురించలేదు. ఎంతసేపని మనిషిబరువు కాళ్లతో మొయ్యగలం? మావూ రొచ్చిన సర్కసులోని పహిల్వాన్‌కూడ అయిదు నిమిషాలకంటె అదనం మొయ్యలేక పోయ్యాడు. మరి అలా వోపిగ్గా ఉండలేక పోయి, శక్తంతా ఉపయోగించి కాళ్లు గట్టిగా లాక్కున్నాను. ఆమె వొళ్లో పెట్టుకున్న చిన్న సూటుకేసుతో సహా— ఆమె పరధ్యానంలో ఉండగా నాకాళ్లని లాక్కున్నానేమో— ఒక్కసారిగా ముందుకు తూలి పడింది. అలా చెయ్యాలిసొచ్చినందుకు నా మనసు కించపడింది. ఆమె దులుపుకుంటూ లేచి నిల్చుంది. నేను ఆమెవంక చూస్తూ లేచి సర్దుకుని కూచున్నాను. ఆమె అలా నిలబడే నావంక కొరకొరా చూస్తోంది. సూచనయినాయివ్వకుండా తనను అంతమందిలో క్రిందికిత్రోసి అవమానపరిచా ననేమో! మరి యింతసేపట్నించీ నేను పొందుతూ వున్న అవమానం! ఎవరితో చెప్పుకునేది? ఆమె అలా నిల్చునే ఉంది. చూస్తూనేవుంది. "లేవమంటే లేచేదాన్నిగా!" అని కాబోలా చూపుల్లోని భావం. లోన యిష్టం లేక పోయినా, నెమ్మదిగా పైకిలా అన్నాను: "క్షమించండి."

"ఊఁ...క్షమించాం." అన్నట్టు చూస్తూ నాప్రక్కను సర్దుకు కూచుంది.

తెలతెలవారుతూ ఉంది. చీకట్లింకా పోలేదు. పెట్లోకూడా అంత చెప్పుకో దగ్గ వెల్తురు లేదు. వెలవెల బోతున్న రేరాజు దూరాన్నించి రైల్తో పందెం కట్టేట్టు

పరిగెత్తుకొస్తున్నాడు. పక్కబల్లమీద కూచున్నవాళ్ల మొహాల్నంతా యీదర గాలి స్పృశిస్తూంది. ఆమె ఉన్నట్టుండి నావైపుకు తిరిగింది. ఆమెతో నేస్తం కలపాలనే సంకల్పం నాలో ఉద్భవించింది. యేవిధంగా ఆమెతో ఉబుసుబోని కబుర్లకు ఉపక్రమించాలి, ప్రస్తావన యే విధంగా మొదలు పెడితే బాగుంటుందో నని నేను తర్జనభర్జన చేసేలోగా ఆమె పెదవులెత్తి "ఎక్కడ దిగేది?" అన్నది నెమ్మదిగా, నోట్లోని పలువరుసయినా బయటికి కనబణ్ణీనంత నాజూకుతో.

నేనూ అన్నాను: "ఇంకా చాలా దూరం వెళ్లాలి, ఈబండి."

"యీ బల్లంతా మీ వొక్కరి నిమిత్తం రిజస్టరు చేసినట్టున్నారు!" అన్నది చిరునవ్వుతో, కనుబొమలు ఎగరవేస్తూ.

"అటువంటి దేం జరగలా." అని నేనంటిని. కొంచెం విసురుగానే, మీద కూచున్నదనే చిన్న కోపం కొద్దీ, కొంచెం ప్రత్యేకంగా చూస్తో.

"క్షమించండి, చీకట్లో కనుపించలేదు. బల్లే అనుకుంటిని. అదీకాక మరోచోట స్థలం కనుపించలేదు. అక్కడికీ వోగంట కాలం నిల్చునే ఉన్నాను. కాళ్లు లాగిన మీదట......"

తూర్పుదిక్కు ఆకాశపు టంచులు ఎర్రబడుతోన్నయ్. పెట్లోకి కొంచెం వెల్తురు బాగా వస్తోంది. వెలుగు బాగా వచ్చే కొలదీ ఆమె మొహం బాగా స్పష్టంగా కనుపించటంతో నా బుర్రలో యేదో మెదిలింది. ఇలాంటి మొహా న్నెక్కడో చూసినట్టు జ్ఞాపకం. ఎక్కడ చూసిందీ గుర్తు రావటం లేదు. మా బంధువుల్లోనే ఇలాంటి అమ్మాయ్ ఉండాలి. ఆ మొహం, ఆ కళ్లు, ఆ నవ్వు, ఆ మాటల్లోని ముద్దేసుకొచ్చే మృదుత్వం, ఆగొంతుకూడాను, అచ్చం, మరేం భేదం లేకుండా, ముమ్మూర్తులా, ఇలాంటి అమ్మాయిని — కాదు; ఈ అమ్మాయినే ఎక్కడచూస్తినో ఆ జ్ఞాపక మనేది రావటంలేదు. దాన్ని తగలెయ్య — నోట్లో ఆడుతోందికాని రావటంమటుకు లేదు. నిద్ర గట్టిగా రాకపోయినా కళ్లు మండుతున్న కారణాన వెనక బల్లకు జార్లాబడి రెప్పలు మూసుకుని అలా ఆమెను గురించి ఆలోచిస్తూనే కూచున్నాను. ఒక్కసారి మా బంధువుల్లోని యావత్తు అమ్మాయిల్నందర్నీ సింహావలోకనం చేస్తూ. ఎన్ని రూపాలయినా హృదయంలోనికి వస్తూపోతూ ఉన్నాయ్. ఇలాటి రూపం లీలగా అయినా రాలేదు. ఇంతలో యేదో స్టేషను రావటం వల్ల కాబోలు బండి ఆగింది. ఆగిన మరో అయిదు నిమిషాల కాలం గడిచాక, పరధ్యానంతో అప్రయత్నంగా ఇట్టే కళ్లు తెరిచి చూస్తినిగదా, ప్రక్కన ఆమె లేదు! నలువంకలా పెట్లోనికి నాచూపులు పోయినా ఎక్కడా లేదు. ఏమయిపొయ్యిందా అని ఆలోచించాను. ఒకానొకవేళ ఇక్కడ దిగిపోయిందేమో? ఆమె దిగాల్సింది యీ స్టేషనే అయ్యుంటుందా? నాకు పాలుపోలేదు. మరో రెండు మూడు నిమిషాలకి బండి కదలబొయ్యేవేళ ఆమె వచ్చి ఎక్కింది. మళ్లీ యథాస్థానంలోనే, అంటే నాప్రక్కనే, కొంచెం తగుల్తూ తగుల్తూ కూచుంది. నేనడిగాను కొంచెం ఆశ్చర్యంతోనే —

"ఎక్కడికో వెళ్లినట్టున్నారే!"

"వెళ్లానుకదూమరి! పైపువద్ద మొహం కడుక్కోవాలని వెళ్లాను."

అన్నది నిమీలిత నేత్రాల్తో.

"మీ మొహం కడిగినట్టు కనుపించదే?"

"లేందే? సమయం సరిపోలేదు."

"పదినిమిషాలు ఆగిందిగా ?"

"ఆగినా, అన లక్కడ పైపు ఉన్నట్టే తోచలేదు."

"అరే! నాకు జ్ఞాపకం. అక్కడ పైపు చూసినట్టు."

"ఉందేమో. కాని పలుదోముపుల్ల దొరకందే?"

ఆమెమాటలు నమ్మదగ్గవిగా తోచలేదు. మొత్తానికి మరోచోటికి పోయి, ఈలా మాట్లాడి ఉంటుంది. ఎలా మాటాడితే మనకెందుకు ?

మేమిరువురం యిలాగ్గా మాట్లాడుకుంటూ ఉండగా వోమూల గొడవ బయల్దేరింది. యేమా యీగలభా అని క్షణం శ్రద్ధగా ఆలకించేసరికి తేలిన విషయం— వొహాయనది తలక్రింది మూట మెవరో దొంగిలించారట. ఆ దొంగిలించిన ప్రముఖులెవరో, ఎప్పుడు దొంగిలించారో, యెక్కడ దిగిపోయారో తేలలేదు. పాపం, ఆ పోగొట్టుకున్నాయన గోలపెడుతున్నాడు. ఆయన మొహం చూస్తే నా కెంతో జాలికలిగింది. ఆమూటలో రెండు కొత్త అంగోస్త్రాలు, వొహ రాగిచెంబు, శ్రీ వెంకటేశ్వరులవారి తాలూకు ఏదో ప్రసాదం, ఇంకా వగయిరా వగయిరా యేమేమో ఆయన లిస్టువేశాడు. కళ్లమ్మట నీళ్ల పర్యంతమూ తెచ్చుకున్నాడు.

"అయ్యో పాపం!" అంటూ సానుభూతితో విచారాన్ని వెలిబుచ్చారు కొందరు పెద్దలు. "అంత అజాగ్రత్తగా ఎందుకున్నావయ్యా స్వామీ?" అంటూ సాగదీశారు కొందరు అనుభవనీయులు. "అంత వొళ్లు మరిచి నిద్రపొయ్యేందుకు ఇది రైలన్నసంగతి మరిచారు శాస్త్రిలుగారు." అంటూ నవ్వలు ప్రారంభించారు కొందరు యువకులు. ఎవరు ఎన్ని అన్నప్పటికీ ఆయనదుఃఖాన్ని తీర్చేవా రొక్కరూ లేకపొయ్యారు పాపం. ఇదే నా విచారం. నాప్రక్కన కూర్చున్న ఆమె ఎందుకో నవ్వుతోంది. ఎందుకో నాకు స్ఫురించలేదు మూట పోగొట్టుకున్న ఆబ్రాహ్మడిని చూస్తే యీమెకు నవ్వుగా ఉందికాబోలు.

ఎందుకేనా మంచిదని నేను ఇట్టే లేచి ఒక్కసారి పైబల్లవంక చూస్తినిగదా, ఇంకేముంది, నాకొంపకు వచ్చింది అల్లరి! నా గుండె జారిపోయింది. చెవులు వేడెక్కినయ్. తనువు తనవారిని విడిచిపోతున్నట్టు, రైలు తల్లక్రిందులుగా బోల్తాకొట్టినట్టు నా కాక్షణంలో అనిపించిందంటే ఆశ్చర్యపడ నవసరంలేదు. యీ నా ప్రళయానికి కారణం పైబల్లమీద పెట్టిన నా బెడ్డింగు ఉంది; కాని దాని అడుగున పెట్టుకున్న లెదర్ సూటుకేసు మాయమయింది. కంపార్టుమెంటు అంతా కలయవెదికేస్తున్నయ్ నాకళ్లు. ప్రతి సూటుకేసుమీదకీ, ప్రతిట్రంకుమీదకీ నా దృష్టి కేంద్రీకరించబడింది. నాపెట్టె ఎక్కడా కనుపించదు. అసలు ఉంటేకదూ కనుపించ

టానికి? నాపెట్టెకు గొళ్లెంవద్ద పేరుకూడా ఉంది, నాపేరు. నిస్పృహతో, నిరాశతో బల్లమీద చతికిలబడ్డాను. బుర్ర పూర్తిగా చెడిపోయింది. ఆక్షణంలో నామొహం ఏయే రూపాలు దాల్చిందో నాకంటె నాప్రక్కనున్నవాళ్లు బాగా చెబుతారు. సంవత్సరం కష్టపడి చదివి, ఫలితాలు తెలిసిన రోజున పరీక్షతప్పిన స్టూడెంటుమొహంకూడ నా మొహం పోయినంత వెలవెల పోదేమో? బట్టల్తో సూటుకేసు పోతే ఇంత వ్యథకు లోనయ్యేవాణ్ణే కాదు. మెదడు కింత కష్టమూ కలిగించకపోదును. అయితే, ఓ తెలివి తక్కువ పని చేశాను. జేబులో ఉంటే బరువుగా ఉందనీ, వాహనాకవేళ జారిపోతుందేమో అనీ, నిద్రపోయే సమయంలో ఎవరేనా తీస్తారేమో అనీ ఇలాంటి అనుమానాలు యేడిపించి జేబులో యాభైరూపాయలపై చిల్లరతో ఉన్న పర్సు తీసి పెట్లో జాగ్రత్త పెట్టాను. ఇలా కొడ్చింది నాతెలివి. టికెట్టుకూడ పర్సులోనే వుండిపోయింది. పెట్టెకు కాళ్లొస్తయ్యని ఏమాత్రం ఊహించివున్నా నా తెలివి ఇలా కాలేది కాదు.

ఇంతవరకూ ఆయన మూట పోగొట్టుకుంటేనే ఇన్నిరకాలుగా మాట్లాడిన యీ మనుషులు నాసంగతి బయటపెట్టుకుంటే ఇంకెన్నివిధాలుగా మాట్లాడి, నా అసమర్థతకు నవ్వుకుంటారో, హేళనచేస్తారో? పోయిన సొమ్ము మరి తిరిగిరాదనరికదా, ఇవన్నీ భరించాలి. మళ్లీ ఓ అయిదునిమిషాలు యోచించగా—ప్రయత్నిస్తే దొరుకుద్దేమో అనే ఆశ! మరుక్షణానికి వచ్చే స్టేషనులో రిపోర్టు యిద్దామా అనుకుంటాను. ఆపైక్షణానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా పోయిన పెట్టె మరి తిరిగిరావటమనేవిషయం స్వప్నవార్తఅని ఆత్మకి సంబంధించిన నిశ్చయం. పెట్టె పోయాక యెన్ని గంటలు గడిచాయో మనకి తెలీదాయె. రాత్రే పోయిందో, అర్ధరాత్రే పరిగెట్టిందో, తెల్లారుజామునే మిస్ అయిందో? నాకు పట్టుకున్నది ఒక్కటే—పెట్టె తీసికెళ్లేవాడు హోల్డాలు ఎందుకు విడవాలీ అని. నాతో చెప్పకుండా, కనీసం, కొంచెం చప్పుడయినా చెయ్యకుండా ఆపని ఎందుకు చెయ్యాలీ అనిన్నీ. నే నిలా కిందా మీదా పడుతూ ఉండగా యేదో పెద్దస్టేషను వచ్చింది. ఒక్క కుదుపుతో బండి ఆగింది.

౩

ఆగటమే తడవుగా ఆమె లేచి నిల్చుంది.

"మీరు మొహం కడగరూ?" అన్నది. జారిపోతూన్న పైటను కొంచెంగా సర్దుకుంటూ. పోయిన పెట్టె పోనే పోయింది; దానికోసం చింతిస్తూ మొహం కడుక్కోవటంకూడా ఎక్కడ మానను మరి! ఆమెను నడవమంటూ నేనూ దిగాను. ఒహోయన సంచీలోంచి వేపపుల్లల కట్ట తీస్తుంటే రెండు పుల్లలు యాచించి తీసుకున్నాను. మేం జోడా ఉన్నాంకదూ మరి! సంబంధం లేని జోడా మాది. మమ్మల్ని చూసేవాళ్లంతా ఏమనుకుంటారో? మిథునమనుకుంటారో, ఇతరవరుసలు భావిస్తారో, స్నేహితులని ఊహిస్తారో! నా కింకో భయం కూడా లేకపోలేదు. నన్ను తెలిసున్నవాళ్లెవరయినా కనుపించి విమర్శచేస్తే! ఏం చెప్పాలి? ఏమో! నాకే తెలీదుకదా!

మేమిద్దరం పైపువద్ద అయిదునిమిషాల్లో మొహం కడగటం ముగించాం. ఆతర్వాత

అధమపక్షం గుక్కెడు కాఫీ అయినా తాగాల్సిన అలవాటుంది. నాజేబులో మటుకు రాగి కాసీ కూడా లేదు. ఓనిమిషం తటపటాయించాను. ఎంత ఊహించినా ఉపయోగమున్నట్టు తోచలేదు. మాట్లాడకుండా త్రాగేసి, 'అయ్యరుగారూ! అరు'వని మనవి చేసుకోటానికి ఇదేమయినా స్వంతఊరు గనుకనా! ఈమధ్య, రోజులు మారి, అక్కడా పలకటం లేదు అరువు. మరేం మాట్లాడకుండా వెళ్లి పెట్లో యెక్కి కూర్చున్నాను ఉసూరుమంటూ. ప్రయాణ మధ్యస్థంలో ఇలా మోసం చెయ్యటంకంటే, తెగని కత్తితో ఒక్కసారిగా యీకంఠాన్ని కోయటం ఎన్నోరెట్లు ఉత్తమం అని నావూహ. యీవిషయాన్ని అటువంటి మహానుభావులంతా గ్రహించాల్సిందని మనవికూడాను. యీ పోగొట్టుకున్న వాళ్లు పడే వ్యథ వాళ్లకే తెలియాలి. ఆబాధను చెప్పటానికీ, రాయటానికీ యీభాషలో మాటలు లేవు. యింటి దగ్గర ఎంతాస్తి ఉంటేనేం? ఎంత డబ్బు ఉంటేనేం? యీక్షణంలో అరకప్పుకాఫీ తాగాలంటే ఒక్క అణా లేదుకదా! ఎంతటి దీనస్థితి!

ఇంటి కెళ్లేవరకూ ఉపవాసం సాగించదలుచుకున్నాను. ఎవరికోసమూ కాదు, నాకోసం. కాఫీ యెలానూ లేదు, సిగరెట్టయినా కాల్చుకుందామని జేబులో చెయ్యిపెట్టాను. ఖాళీపాకెట్టు గలగలమంది. నేను వచ్చెయ్యటంతో నావెనుకనే ఆమెకూడ వచ్చింది. నే కూచున్న కిటికీదగ్గరగా ప్లాట్‌ఫారం పయిన నిల్చుని, ఆప్యాయతతో కూడిన స్వరంతో—

"కాఫీతీసుకోకుండా వచ్చేశారేం?"

యేం చెప్పను సమాధానం? నావద్ద డబ్బేం లేదని చెప్పటానికి సిగ్గూ, అభిమానం యేడిపిస్తున్నయ్. ఆమెకు సమాధానం యివ్వాల్సిన బాధ్యత నాయందు ప్రస్తుతం ఉంది. మరేం తోచక, ఇలా అన్నాను—

"కాఫీ అలవాటులేదు."

ఒక్కొక్కప్పుడు అనుకోకుండాకూడా అబద్ధం ఆడాల్సిన అవసరం వస్తుందికాబోలు. ఆమెవంక చూడకుండానే యీమాటలు అన్నాను.

"అబద్ధమాడుతున్నారు!"

నవ్వుతూ అంది. ఎవరో ఈమెతో చెప్పింది నే నబద్ధమాడుతున్నట్టు. అసలు నాకాఫీగొడవ యీమె కెందుకో నాకు తెలీటంలేదు.

"నే నబద్ధమాడుతున్నానా?"

ఆమె మొహంలోనికి అదోలా చూస్తూ అన్నాను.

"నేను చెప్పాలా? మీకు తెలీనప్పుడు కదా!" కొంచెం నిక్కచ్చిగానే అంది.

"యీచర్చ దేనికిగాని, మీరు తీసుకురండి. టైము లేదు." అన్నాను బెట్టుసరిగా.

"అలా కాదు. నాకోసమయినా మీరు తీసుకోవాలి."

బ్రతిమాలుతున్నట్టు స్ఫురిస్తున్న చూపుల్తో అటువైపుకున్న నాచేతిని తన చేత్తో స్పర్శించింది! ఆమెసాహసానికి నాకు ఆశ్చర్యమే కలిగింది. ఆమెస్పర్శ నాలో తెలియని ఆనందాన్ని కలిగించింది. నేననుకుంటాను- యీ అమ్మాయి నన్నుగాని ప్రేమించటం లేదుగదా? ఆమె అంతపనీ చెయ్యటంగాని

తటస్థించిననాడు నాగతేం గాను? ఇంటి దగ్గరున్న ఇల్లాలు చీపురుకట్ట తీసేటంత పని చేయదూ! "నాకోసమైనా" అంటే ఆమాటల్లోని సిసలయిన భావం ఏమయ్యేంటుందీ? మీరు తాగన్నాడు నేనూ మానేస్తాను సుమా అని చెప్పటమా? ఆమెకూ నాకూ యేమిటి సంబంధం? యేం లేదు, ఇందాకటినించీ అయిన కొద్దిపరిచయంమాత్రమే. అంతగా బలవంతపరుస్తుంటే మరేం చేసేది? విధిలేక దిగాను. ఆమెను అనుసరించాను. బుర్రంతా ఆలోచనల్తో రేగిపోతోంది.

3

కాఫీకి ఆమెతోకూడా వెడుతున్నా నన్న మాటేగాని, నాలోని శక్తులన్నీ ఒక్కోటీ వెనక్కి పారిపోతూనే ఉన్నయ్. నిజానికి నాకు ప్రతిరోజూ కాఫీ తాగాల్సిన అలవాటు రెగ్యులర్ గా ఉన్నప్పటికీ అవ్వాళమాత్రం యేమో దానిమీద వాంఛ లేనేలేదు. తీరా కాఫీ తీసుకున్నాక నేనే డబ్బులు చెల్లించవలసిన పరిస్థితులు యేర్పడితే—ఇంతవరకూ ఆమెదృష్టిలో నాకున్న గౌరవం కాస్తా గంగనుకలిసిపోదూ? మోజు కాస్తా గుటుక్కుమనదూ? దిక్కుమాలినవాడు, నాపెట్టె తీసుకుపోవాలీ? నాపెట్టెకంటె మంచివీ, పెద్దవీ దానియెదురుగా, ప్రక్కగా యెన్ని లేవు? సరే, ఎలా జరగాల్నుందో చూదాం! ఉరిశిక్షపడ్డ నేరస్థుడుకూడా ఆపని రేపే జరుగుద్దని తెలిసినా, యింత జిజ్ఞాస పడడేమో!

వెళ్లాం. కూర్చున్నాం. నేనుమాత్రం యీప్రపంచానికి సంబంధించిలేను. మరెక్కడున్నావయ్యా అని ఎవరయినా నిలదీసి అడిగితే—టక్కున చెబుతాను—పెట్టెలు, పరుపులు, అర్థాంతరమధ్యస్థంలో పోగొట్టుకున్న నాలాంటి దద్దమ్మల బుర్రలన్నీ ఎక్కడుంటయ్యో తెలీదుటయ్యా అని. కర్మం చక్కగా కాల్తేగాని, రైల్లో, సొమ్ములు శీదాగా కోల్పోటం జరగదు. (కసీసం అప్పటి నాదృష్టిలో) పుట్టిబుద్ధెరిగింతర్వాత ఇలాంటి భంగపాటు ఎన్నడూ ఎరగనుకదా!

ఆవిడ ఏం చెప్పిందో, నా కాసింతయినా తెలీలేదు. ముందుకు వచ్చి పడేవల్లా అవి మినపఇడ్డెన్లో, పెసరట్లో, ఉప్మా పేరుతో చెలామణీ అవుతున్న ఉప్పుడు పిండో తెలుసుకోకుండానే నేను తింటున్నాను. యింతలో వచ్చింది పొగలు గ్రక్కుతూ కాఫీదేవత. తొందరగా తాగేస్తే డబ్బులు ఎక్కడ ఇవ్వాలిసొస్తుందో అని తిరగా బోల్తా వేస్తూ కూర్చున్నాను. ఆమె కాఫీ త్రాగేసి, లేచి వెళ్లి మొత్తంబిల్లు చెల్లించింది. నాకళ్లారా చూశాను. అప్పుడు వెళ్లింది కాఫీకప్పు నోటివద్దకు. రామరామా! చల్లారిపోయింది, గోరువెచ్చగా అయినా లేదు, చేదువిషం! మరి చేతులు నొప్పిపెట్టే వరకూ తిరగబోశానామె! కళ్లు మూసుకు ఆముదం మింగినట్టు — అప్పుడప్పుడు మా డాక్టరుగారు యిచ్చే డోసు మింగినట్టు—అయిందనిపించి లేచాను. లావాటివాడు నిల్చున్నాడు బల్లముందు. జేబులో చెయ్యి పెడుతూ—

"ఆవిడిదీ, నాదీ బిల్లు!"

అన్నాను మోజుగా. ఆమె యిచ్చిందన్న ధైర్యంతో. వీ డింకా సమాధానం యివ్వకుండానే బయట నాకోసం నిల్చుని వెయిట్ చేస్తున్న నా నూత్న స్నేహితురాలు-

"రండి, రండి. నే యిచ్చాను."

అంది. ముక్కునున్న బేసరులోని రాయి పొద్దుపొడుపుఎండకు మిలమిలా తళతళా మెరుస్తోంటే, సైడు పోజులో.

యింత సేపట్నుంచీ అంత బాధించక పోయినా, సిగిరెట్ ఇప్పుడు కావాలి. యేదో పెద్ద ప్లాన్ వేసేవాడిలా దృష్టి భూమ్మీదికి తిప్పి యేదో ఆలోచిస్తున్నట్టు నటిస్తూ క్రింది పెదవి మునిపళ్లతో నొక్కుతూ, నిల్చుండి పోయాను.

"ఇంకా నిల్చున్నారేం?"

ఆమె ప్రశ్నించింది.

"హా...ఏమిటి అంటున్నారు?"

తల పైకెత్తి అన్నాను. అప్పుడే యీ ప్రపంచంలోనికి వచ్చినవాడిలా.

"బండి కదలటానికి సిద్ధమవుతోంటే, ఇంకా సావకాశంగా నిలబడ్డకారణం అడుగుతున్నాను."

అన్నది మళ్లా. విసుగుదల చూపకుండా.

"మీవద్ద చిల్లర ఏమయినా ఉందా?"

నావద్ద నోట్లు యేడిసినట్లు!

"ఎంత కావాల్నేం?"

"నాలుగు అణాలు."

అన్నాను, మొహం యింకోవైపుకు తిప్పుకుని.

"ఇవిగో..."

తీసుకున్నాను. హృదయం సిగ్గుపడుతోంటే.

"మీరు వెళ్లి ఎక్కండి! ఇప్పుడే వస్తున్నాను."

సిగరెట్ నిమిత్తం ప్రదర్శింపబడ్డ పాట్లి వన్నీ.

౪

వెధవపెట్టె పోతేపోయిందిగాని, ఆమె పుణ్యమా అంటూ విల్సుసిగిరెట్టు దర్జాగా కాల్చుకుంటూ కదులుతూన్న బండెక్కి యథాస్థానంలో ఆమెప్రక్కనే ఆసీనున్నయాను.

"యిందాకట్నించే పరిశీలిస్తున్నాను. మీవ్యవహారమంతా పరధ్యానంగా కన్పిస్తోంది."

గెడ్డానికి చెయ్యి నానించుకుని అన్నదామె. సిగిరెట్టు ఒక్కసారి గట్టిగా పీల్చి పొగను తమాషాగా బయటికి వదిలాను.

"ముందుచూసిన కళ మీ మొహంలో కనుపించడంలేదు."

మళ్లా పెదవులెత్తి ఆమె అన్నది. నేను వినిపించుకోనట్టు, ఒకటొకటే పరుగెడుతున్న టెలిగ్రాఫ్ స్తంభాల్ని లెక్కపెడుతూ బయటికి చూస్తున్నాను, ఆమె ఇంకా ఏమంటుందో అని.

"ఈవల నేను మాట్లాడుతున్నది నా సూటుకేసుతో కాదన్న సంగతి తమరు గ్రహించాలి."

యీసారి ఆమెగొంతులో కోపమూ, దాంతో కలిసిన చిరునవ్వూ వినిపించినై అప్పుడు సిగిరెట్టు ముక్క బయటికి విసరి ఆమెవంకకు తిరిగాను. నిజానికి నాగొడవ నాది. మావూరు దగ్గరకు వస్తోంది. అన్నిటిమాటా మెలా ఉన్నా ముందుసంగతి టికెట్టులేదు. ఎక్సెసు అడిగితే డబ్బూ లేదు. ఇంటికెళ్లి పంపుతానయ్యా అంటే వూరుకునే మాస్టరూ కాదు. యీగొడవ తల్లో మెదుల్తో నేను అవస్థపడుతున్నాను.

"మీా రేదో తీవ్రసమస్యలో మునిగి అవస్థపడుతున్నట్టు తోస్తోంది."

అని అందుకుంది మళ్లా. ఇక వినిపించుకోనట్టు ప్రవర్తించటం మోటగా ఉంటుంది. అన్నాను—

"ప్రస్తుతం ప్రాణంకంటెకూడ విలువైన వొక వస్తువు పోగొట్టుకున్నా."

"రైల్లోనే?"

"ఆహా! బండిలోనే."

"మకేమిటో ఆవస్తువు?"

"ఏమయితే నేం? పోయింది. మూడు రోజులు నిరాహారదీక్ష పూనినా మరిరాదు."

"చిత్రంగానే వుంది. మీా భార్య గాని మీాతో చెప్పకుండా ఏస్టేషనులో అయినా వుడాయించ లేదుగదా?"

"ఇంటివద్ద కులాసాగా ఉంది. అలా వెళ్లేదికాదు."

"ప్రాణంకంటే కూడ విలువైన దంటిరి. ఇంకేమిటి?"

"ఏమి టని చెప్పను? నామొహం."

"మీా మొహం మీా మొహంలోనే ఉందిగా."

"యేడ్చేవాళ్లని చూస్తే నవ్వేవాళ్లకి మహాసరదా."

"ఏమీా పోనప్పుడు, పోయిందని చెప్పకోవటం దేనికంట?"

ఇంకో సిగిరెట్టు తీసి నిప్పు ముట్టించాను.

"నన్నెప్పు డయినా ఇదివరలో చూసినట్టు జ్ఞాపకమా?"

నేను త్రుళ్లిపడ్డాను. అందు గురించి అడగాలనే, పెట్టెపోయిన గొడవలో, మరచాను.

"అదే నేనూ అడగాలనుకుంటున్నా. ఎక్కడో చూచినట్టు గుర్తే. ఎక్కడ చూశానో జ్ఞాపకం రావటం లేదు. దయవుంచి వివరించమని నాకోరిక."

"వివరిస్తాగాని, మగవాళ్లు ఇంత త్వరగా మరిచిపోతా రేమని, నాకు తెలీక అడుగుతాను."

"క్షమించాలి. మరుపనేది ప్రతివారికీ సహజం. మిమ్మల్ని ఎక్కడో చూశాను."

"ఇంకా జ్ఞాపకం రాలా?"

"దాని దుంప తెగ, అది రావటంలేదు."

"సరే చూదాం. ఎప్పటి కొస్తుందో?"

"పోనీగాని, మీారు చెప్పరాదూ?"

"సమయం రానీండి, నేనే చెబుతాను"

బావుంది. నాకు జ్ఞాపకంరాదు; తను చెప్పదు. యేమిటో సమయం రావాలంటుంది. తెలుసుకోవాలని నాకాతృత, హాడావిడీని. మళ్లా అన్నాను:

"మీారు మాకేమయినా బంధువులా?"

"బంధువులో, స్నేహితులో, అంతకంటెకూడ యెక్కువో చెబుతానుగా"

"ఆ చెప్పేదేదో కొంచెం తొందరగా చెప్పాల్సిందని నాకోరిక"

"మీారు దిగే దెక్కడ?"

"వచ్చే స్టేషన్"

"బెజవాడ?"

"అవును. బెజవాడే, నే దిగేది"

ఆమె మొహంలో యెందుకో చిరునవ్వు అంకురించింది. ఇంతలో బెజవాడ రావటం, బండి ఆగటం జరిగింది. ఆమె పెట్టెతో ముందూ, ఉన్న వొక్క బెడ్డింగూ చంకను

పెట్టె నేను వెనుకా దిగాం. ఆమె నాచెయ్యి పట్టుకుని-

"తమరు ఇక్కణ్ణే నిలబడిఉండండి. మీ పెట్టె ఎక్కడికీ పోలేదు"

అంటూ పరిగెట్టింది. నేను నిర్ఘాంత పోయి చూస్తూ నిల్చున్నాను. పెట్టె పోలేదంటూఉంది. నా కర్థంకాదు. అయోమయం గా ఉంది. పెట్టె ఉందనగానే నాలో వెయ్యి సూర్యులు ప్రతిఫలించారు. అమ్మాయి నాకు తెలిసున్నదే. కాని ఎవరో ప్రస్తుతం మరిచాను. నేను చూస్తూఉండంగానే పెళ్లి మూడుపెట్టెలకు ఆవలనున్న ఆడాళ్లపెట్టెలో ఎక్కింది. వెంటనే దిగింది. నాపెట్టెతో- నా పెట్టెతోనే. ఆమెకూడా ఇంకో నలభైయేళ్లావిడకూడ ఉంది. ఆ పెద్దావిడ మా మేనత్తలా ఉంది. ఉండటమే కాదు, స్వయంగా మా మేనత్తే. యీామెకు ఆవిడతో సంబంధం యేమిటో? ఆవిడకూతురు జానకి ఇలా ఉంటుంది. జానకిని చూసి అయిదేళ్లయిన మూలాన మరచిపోయాను. జానకేగనక అయితే అప్పుడే ఇంతవుతుందా అని? అసలు నాకిచ్చి పెళ్లిచేదా మనుకున్నదికదూ జానకిని.

"యేమోయ్ రఘూ, అంతాకులాసా?"

"బావా! మరిచిపోయావుగా నన్ను? ఇదిగో, నీపెట్టెదొంగను పట్టాను. నీదవునో కాదో చూడు"

పెట్టె నాచేతి కందించి అమ్మచాటుకు తప్పుకుంది. అసలు నాకు తలేదో, తోకేదో బోధపడలేదు.

"అత్తయ్యా! యేమిటిది?"

వెర్రిగా ప్రశ్నించాను. అత్తయ్య నవ్వుతూ—

"ఇదంతా నీమరదలు కొంటెతనానికి చేసిన పని. మేం రైలు ఎక్కగానే ముందుగా నువ్వున్న పెట్లో ఎక్కాం. కాళీ యెక్కడా లేదు. నిద్రపోతున్న నిన్ను గుర్తుపట్టాను. 'బావఇదుగో నే' అని దీనికి చూపాను. నేను ఆడాళ్ల పెట్లోకి వెళ్లాను. ఇదక్కడే కూచుంది. మరి కాస్సేపటికి నీపెట్టె తీసుకువచ్చి నావద్ద పెట్టింది. నువు బావకు కనుపించ వద్దని నాతో చెప్పింది. ఇదీ సంగతి"

అంటూ అత్తయ్య విశదీకరించింది. ఇంతకూ జానకిని మరిచిపోయినమూలాన ఇంతగొడవ కలిగింది. అన్నా :

"అమ్మదొంగా, ఎంతపని చేశావ్ జానకీ! బుర్రంతా పాడుజేశావ్ కదా! ఎక్కడ నేర్చుకున్నా వీపన్లు?"

"వెడతామోయ్, గంట కొట్టారు"

"వంపన్లు చేశానేం? పెట్టెఇచ్చిందికాకుండా—బావా! గుడ్ బై"

వాళ్లిద్దరూ ఎక్కారు. బండీ కదిలింది. కనుపించేంతవరకు చెయ్యి విసురుతూనేఉంది జానకి. మాజానకి ఎంతపని చేసిందా అనుకుంటూ పెట్టెతాళం తీసి టిక్కట్టు యిచ్చి బయటపడ్డాను.